
# అందమయిన అబద్ధాలు

- కె.శ్రీఉదయిని


**ఉగాది పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**



**బ్రేక్ ఫాస్ట్ తింటూ భార్గవ, ప్రజ్ఞ టివిలో క్రికెట్ చూస్తున్నారు. లీ వేసిన బంతిని సచిన్ అలవో కగా బౌండరీ దాటించటంతో ఆ ఓవర్ పూర్తి అయింది. వెంటనే ప్రకటనలు మొదలయ్యాయి. ప్రజ్ఞ చిరాకుగా తండ్రి వంక తిరిగింది. 'నాన్నా! ఆట మధ్యలో ఈ యాడ్స్ చూడాలంటే బోర్ కొడుతుంది. కాని నువ్వు డిజైన్ చేసిన యాడ్స్ మాత్రం వెరయిటీగా ఉంటాయి...' అంది.**

ఆమె ముచ్చట తీర్చటం కోసమని అన్నట్లుగా భార్గవ రూపొందించిన ప్రకటన రాసాగింది.

ఓ యువతి వేగంగా స్కూటర్ పైన వెడుతుంటే ఆమె బ్యాగ్ లోంచి ఫెయిర్‌నెస్ క్రీమ్ ట్యూబ్ పడిపో తుంది. చదువు రాని ఓ పశువుల కాపరికి అది దొరు కుతుంది. ఏం చేయాలో తెలియక దాన్ని ఓ గేదెకి పూయటం మొదలు పెడతాడు... వారం రోజులలో అది ఆవు లాగా తెల్లగా అయిపో తుంది.



ప్రకటన ఆసాంతం ఆసక్తిగా చూసింది ప్రజ్ఞ. కూతురి వంక గర్వంగా చూశాడు భార్గవ. ఆ ఫెయిర్‌నెస్ క్రీమ్ అమ్మకాలు అనూ హ్యంగా పెరగటానికి ఆ ప్రకటన ముఖ్య కారణం మరి!

'ఇలాంటి అయిడి యాలు నీకు ఎలా వస్తాయి నాన్నా...' ప్రజ్ఞ అడిగింది.

భార్గవ చిన్నగా నవ్వాడు. ప్రకటనా రంగంలో భార్గవకి చాలా పేరు ఉంది. వినియోగదా రులని ఇట్టే ఆకర్షించే చిట్కాలు, వారి దృష్టిని ఎంచక్కా గేలం వేసి పట్టేసే ఉపాయాలు. ఆయన బుర్రలోంచి నిరంతరంగా వస్తూనే ఉంటాయి... సాధారణ ఉత్పత్తులలో వాటిని తయారుచే సిన వారికే తెలియని సుగుణాలు ఉన్నాయని కన్స్యూమ ర్స్‌ని ఒప్పించే సామర్థ్యం ఆయన సొంతం. చూసేవారి మనసుని సూటిగా తాకి ఈ ప్రొడక్ట్‌ని తప్పకుండా కొనాలి అన్న నిర్ణయానికి తీసుకువెళ్ళే ప్రకటనలు ఎప్ప టికప్పుడు వినూత్నంగా రూపొందించటం అన్న టెక్ని క్‌ని ఆయన సొంతం చేసుకున్నాడు.

కూతురి ప్రశ్నకి సమాధానం ఇవ్వకుండా కాఫీ కప్పు అందుకున్నాడు భార్గవ.

'నాన్నా!...' అంది ప్రజ్ఞ. ఆమె స్వరంలో ఏదో మార్పు రావటం భార్గవ ఇట్టే కనిపెట్టాడు. ఆమె వంక సూటిగా చూశాడు. స్వరంలోనే కాదు ప్రజ్ఞ ముఖ కవళికలలోనూ చాలా మార్పు వచ్చింది. ప్రజ్ఞ సిగ్గు పడుతున్నది!

'ఏం కావాలమ్మా...' భార్గవ మెత్తగా అడిగాడు.

ప్రజ్ఞ కొద్దిసేపు తరువాత నోరు విప్పింది. 'రేపు ప్రభా కర్ మన ఇంటికి వస్తానని అన్నాడు డాడీ!'

'ప్రభాకరా?... ఎవరతను?... మన ఇంటికి ఎందుకు వస్తున్నాడు?...' అయోమయంగా అడిగాడు భార్గవ.

'ప్రభాకర్ నా కలీగ్ డాడీ!... మేమిద్దరం పెళ్ళిచేసుకో వాలని అనుకుంటున్నాం...' ప్రజ్ఞ చెప్పింది.

ప్రభాకర్ చదువు, ఉద్యోగం, జీతం, కుటుంబ స్థితిగతులు మొదలయినవి అన్నీ కనుక్కున్నాడు భార్గవ. అన్నీ సంతృప్తికరంగా తోచాయి. పైగా అమ్మాయి ఇష్టపడుతున్నది... ఇక కాద నేందుకు ఏముంది అనుకున్నాడు భార్గవ. 'రేపు అతన్ని తప్పకుండా రమ్మనమని చెప్పు... అతన్ని చూసి మాట్లాడాలని నాకూ ఉంది' అన్నాడు భార్గవ.

అంతలో ప్రజ్ఞ పక్కన ఉన్న సెల్ మోగింది. ఫోన్ చేసింది ప్రభాకర్. అతనితో గుసగుసగా మాట్లాడి సెల్ తండ్రికి అందించింది ప్రజ్ఞ.

నాలుగు నిముషాలు ప్రభాకర్‌తో మాట్లాడాడు భార్గవ. వినసొంపుగా ఉన్న అతని గొంతుని ఆధారంగా చేసుకుని అతని రూపురేఖలని అంచనా వేసుకుంటే భార్గవకి సంతృప్తి కలిగింది. 'రేపు మీ రాకకోసం ఎదురు చూస్తుంటాను...'అని ప్రభాకర్‌తో చెప్పి సెలవు తీసుకు న్నాడు.

సెల్ కూతురికి అందిస్తూ 'కంగ్రాట్యులేషన్స్ ప్రజ్ఞా! ప్రభాకర్ సీమ్స్ టు బి ఎ నైస్ పెర్సన్. అతన్ని కలిసి మాట్లాడాలని అనుకున్నాను... అయితే ఆ కోరిక రివ ర్స్‌లో తీరబోతున్నది...' అన్నాడు భార్గవ.

ఆఫీస్‌లో పనిలో మునిగినా భార్గవకి హుందాగా ధ్వనించిన ప్రభాకర్ గొంతు అప్పుడప్పుడు గుర్తుకి వస్తూనే ఉంది.

లంచ్ టైమ్ తరువాత భార్గవని కలవటానికి విద్యాపతి వచ్చాడు. విద్యాపతి ఓ ప్రముఖ కోచింగ్ సెంటర్ అధి నేత. విద్యని నమ్ముకుని చిన్నగా ట్యుటోరియల్ కాలేజి పెట్టుకున్న విద్యా పతి కాలక్రమేణా పెరిగి పోతున్న పోటీని ఎదు ర్కోవాలంటే విద్యని అమ్ముకోక తప్పదని గ్రహించి పంథా మార్చు కున్నాడు. సబ్బులు, రేజర్లు, టివిలు ఎక్కువగా అమ్ముడుపో వాలంటే ప్రకటనలు చాలా అవ సరం కదా అలాగే కోచింగ్ సెంటర్లు వృద్ధిచెందాలన్నా ప్రకట నలు తప్పవు అని అతను భార్గవ ద్వారా విద్యా కోచింగ్ సెంట ర్‌కి ప్రచారం ప్రారంభించాడు.

'మొన్న ఎంసెట్‌లో మా విద్యార్థులు సాధిం చిన విజయాల గురించి మీరు డిజైన్ చేసిన ప్రకటనలు అద్భుతంగా వచ్చాయి... అయామ్ వెరీ హాపీ!...' అన్నాడు విద్యాపతి.

భార్గవ సంతోషంగా తల ఊపాడు.

'ఇంకో రెండుమూడు రోజులలో ఆల్ ఇండియా ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఫలితాలు వస్తాయి... అందులో కూడా మా స్టూడెంట్స్ మంచి రాంకులు చేజిక్కించుకుంటారని నమ్మకం ఉంది. కాబట్టి ఆ ప్రకటనల గురించి కూడా ఆలోచించండి'. విద్యాపతి అన్నాడు.

భార్గవ నవ్వాడు. సొరుగులోంచి కొన్ని కాయితాలు తీసి విద్యాపతికి చూపించాడు... ఎంసెట్, ఇంటర్‌లో వచ్చిన రాంకుల నెంబర్లు మెట్ల లాగా ఉన్నాయి... వాటిని అధిరోహిస్తున్న విద్యార్థులు ఆల్ ఇండియా ఎగ్జా మ్‌లో రాంకుల శిఖరాగ్రాలని చేరుకుని విజయ కేతనా లని నాటుతున్నట్లు ఉన్న ఆ ప్రకటన చూసి విద్యాపతి ముగ్ధుడయ్యాడు.

'మీ విద్యార్థుల రాంకులు తెలియగానే వాళ్ళ పేర్లు మాకు చెప్పండి చాలు.. మొన్న ఎంసెట్ సమయంలోనే రకరకాల భంగిమలలో వాళ్ళ ఫొటోలు తీసుకున్నాం కదా.. రాంకుల ప్రకారం ఆ నెంబర్లు, ఫొటోలు

మారుస్తాం!.. అంటే ఫలితాలు వచ్చిన అరగంటలో మా ప్రకటనలు సిద్ధం అన్నమాట!..' భార్గవ చెప్పాడు.

ఎడ్వర్టైజ్‌మెంట్ రంగంలో భార్గవ అంత పైకి ఎలా వెళ్ళాడో విద్యాపతికి అర్థమయింది. ఎంత సునిశితంగా ఆలోచించి చురుకుగా అమలులో పెడతాడో కళ్ళ ఎదురుగా ప్రత్యక్ష నిదర్శనం కనబడుతున్నది కదా!

విద్యాపతి బ్రీఫ్‌కేసు తెరిచి చెక్‌బుక్ తీశాడు. అడగక మునుపే ప్రకటనతో సిద్ధంగా ఉన్న భార్గవకి అప్పటికప్పుడే పేమెంట్ చేయాలని విద్యాపతి ఉద్దేశ్యం.

అంతలో విద్యాపతి సెల్ మోగింది. పెన్‌కోసం జేబువేపు వెళ్లిన చెయ్యి సెల్‌ని అందుకుంది. ఫోన్ అతని సెక్రటరి నుంచి. 'ఏమిటయ్యా! కొంపలు మునిగిపోయినట్లు ఫోన్ చేశావు?" విద్యాపతి అడిగాడు.

'కొంపలు మునగలేదు కాని కాస్త ఇబ్బంది కలిగించే వార్త సార్.' సెక్రటరి అన్నాడు. 'విద్యాసంస్థల ప్రకటనలు మరీ శృతి మించుతున్నాయని, ఎంసెట్ ప్రకటనలలో స్టూడెంట్లని సినిమా ప్రకటనలలో లాగా వాడుకుని జనాలని మభ్యపెడుతున్నారని హైకోర్టుకి కోపం వచ్చింది సార్... అందుకనే ఇంకొన్ని రోజులలో రాబోయే ఆల్ ఇండియా ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఫలితాల గురించి ఏ విధమయిన ప్రకటనలు చేయకూడదని ఆదేశాలు జారీచేశారుట సార్. ఇప్పుడే ఆ ఆదేశాలు వెలువడ్డాయిట..'

సెల్ ఆఫ్ చేసి ఒక్క క్షణం ఆలోచించాడు విద్యాపతి, 'సారీ భార్గవగారూ! మీరు శ్రమపడి ఆ ప్రకటన తయారు చేశారు కాని దురదృష్టవశాత్తూ అవి వాడుకోలేం..' అంటూ హైకోర్టు ఉత్తర్వుల గురించి వివరించాడు.

భార్గవ భ్రుకుటి ముడిపడింది.

విద్యాపతి లేచి సెలవు తీసుకుని లిఫ్ట్‌లో నాలుగు అంతస్థులు దిగి కార్‌ని చేరటానికి బహుశా నాలుగు నిముషాలు పట్టి ఉంటుంది. డ్రైవర్ తలుపు తీశాడు విద్యాపతి కూర్చోబోతుంటే అతని సెల్ మోగింది. 'విద్యాపతి గారూ! ఆల్ ఇండియా ఎగ్జామ్ ఎడ్వర్టైజింగ్ గురించి అర్జెంట్‌గా మాట్లాడాలి..' అటు నించి భార్గవ గొంతు వినబడింది.

హైకోర్ట్ అంత స్పష్టంగా చెప్పాక ఇంకా ప్రకటనలు ఎలా సాధ్యమవుతాయి?.. కాని భార్గవ పైన ఉన్న నమ్మకంతో తిరిగి ఆఫీసులోకి అడుగుపెట్టాడు విద్యాపతి.

విద్యాపతి కూర్చోంగానే భార్గవ అన్నాడు. 'ఫలితాలు రాగానే మాకు వెంటనే తెలియచేయండి. టివి చూసే వారిని కాని వార్తాపత్రికలు చదివే పాఠకులని కాని ఆకర్షించే విధంగా స్క్రిప్ట్ రాస్తాం. ప్రకటనలు వద్దు అన్న నిబంధన ఉంది.. నిజమే.. కాని దీన్ని ఛానెల్ వారు కాని న్యూస్ పేపరు వారు కాని వార్త విశేషంగా కవర్ చేయకూడదని అనలేదు కదా?!'

'న్యూస్ ఐటమ్‌గా ఎలా కవర్ చేస్తారు?' విద్యాపతి అడిగాడు.

'ప్రకటనకి ఎంత ఖర్చు అవుతుందో అంత మీరు లోపాయికారీగా వారికి ముట్టచెబుతారు కాబట్టి.. వార్తలలో విద్యా కోచింగ్ సెంటర్ నుంచి ఆల్ ఇండియా పరీక్షలలో చాలా మంచి రాంకులు వచ్చాయి. ఈ ఈ విద్యార్థులకి ఫలానా రాంకులు వచ్చాయి అని సవిస్తరంగా చెబుతూ మీ కాలేజిని చూపిస్తే అది ప్రకటన కిందకి ఎలా వస్తుంది?.. ఆ విధంగా మీరు అనుకున్న ప్రచారం నిర్విఘ్నంగా జరిగిపోతుంది.' భార్గవ నవ్వాడు.

విద్యాపతి అప్రతిభుడయ్యాడు. అతను కోలుకునేందుకు కొంత సమయం పట్టింది. టేబులుపైనుండి కొద్దిగా వంగి భార్గవ రెండు చేతులూ అందుకున్నాడు. 'సూపర్ అయిడియా గురువుగారూ! హ్యాట్సాఫ్!... అందుకనే ప్రకటనా రంగంలో మీకు తిరుగులేదు... ఇలాంటి గొప్ప ఆలోచన ఇంకా ఎవరికీ రాదు కాబట్టి మిగిలిన వాళ్ళు ఏం చెప్పుకోలేరు. కాని మా గురించి ఎంచక్కా ప్రచారం జరిగిపోతుంది..' విద్యాపతి చెక్‌బుక్ తీసి చకచకా రాసి భార్గవకి అందించాడు.

ఆ చెక్ అందుకున్న భార్గవ గుబురు మీసాల వెనక గర్వంతో కూడిన చిరునవ్వు మెరిసింది. విద్యాపతి ముందుగా ఇద్దాం అనుకున్న దానికన్నాచాలా ఎక్కువ మొత్తం అది మరి! ఆయన ఎడ్వర్టైజింగ్‌లో చేరినప్పుడు మొదటి బాస్ చెప్పిన సంగతి ఆయన ఎప్పటికీ మరిచిపోలేదు.. 'భార్గవా! ఈ ప్రపంచంలో రెండురకాల అబద్ధాలు ఉన్నాయి. ఒకటి మామూలు అబద్ధాలు.. రెండోవి ఎడ్వర్టైజ్‌మెంట్లు.. ఈ సంగతి గుర్తుంచుకో.. పైకి వస్తావు..' అన్నాడు ఆ మొదటి బాస్.. 'అది పూర్తిగా నమ్మాను కాబట్టే ఇప్పుడు ఈ స్థానంలో ఉన్నాను..' అనుకున్నాడు భార్గవ చెక్ వంక చూస్తూ.



కోకో డ్రింక్ తాగేది ముఖ్యంగా పిల్లలు కాబట్టి వాళ్లని ఆకర్షించేందుకు కొత్త రకమయిన బొంగరాల సెట్లని ఉచితంగా ఇవ్వాలని, అన్ని పాఠశాలలో ఆ బొంగరాల పోటీలు నిర్వహించి ప్రచారం చేయాలని భార్గవ ప్రతిపాదించాడు. ఆ కాంపయిన్ బాగా క్లిక్ అయ్యిందిట.. ఇప్పుడు ఆ డ్రింక్ క్రమంగా నెంబర్ వన్ పొజిషన్‌ని చేరుతున్నదిట. 'పొద్దున ప్రజ్ఞ ఓ మంచి కబురు చెప్పింది..

ఆ సాయంకాలం అతనికి ఇంకో మంచి వార్త తెలిసింది. ఓ కోకో డ్రింక్ అమ్మకాలు ఎన్ని విధాలా ప్రయత్నించినా పుంజుకోవటం లేదని భార్గవని సంప్రదించారు. కోకో డ్రింక్ తాగేది ముఖ్యంగా పిల్లలు కాబట్టి వాళ్లని ఆకర్షించేందుకు కొత్త రకమయిన బొంగరాల సెట్లని ఉచితంగా ఇవ్వాలని, అన్ని పాఠశాలలో ఆ బొంగరాల పోటీలు నిర్వహించి ప్రచారం చేయాలని భార్గవ ప్రతిపాదించాడు. ఆ కాంపయిన్ బాగా క్లిక్ అయ్యిందిట.. ఇప్పుడు ఆ డ్రింక్ క్రమంగా నెంబర్ వన్ పొజిషన్‌ని చేరుతున్నదిట. 'పొద్దున ప్రజ్ఞ ఓ మంచి కబురు చెప్పింది.. ఆ తరువాత అన్నీ శుభవార్తలే..' అనుకున్నాడు భార్గవ పొంగిపోతూ.

★★★

అతని సంబరమంతా ఆ మర్నాడు ప్రభాకర్‌ని చూడగానే పటాపంచలయ్యింది.

'రా ప్రభాకర్ రా!..' అంటూ ప్రజ్ఞ తీసుకువస్తుంటే ప్రభాకర్‌ని చూసి భార్గవ నిర్ఘాంతపోయాడు. నల్లటి రంగు పూసుకున్నట్లు తారులో ముంచి తీసినట్లు ఉన్నాడు ప్రభాకర్ ఇలాంటి వాడినా ప్రజ్ఞ ప్రేమించింది?

ఏదో మర్యాదకోసం అని ప్రభాకర్‌తో నవ్వుతూ మాట్లాడాడు కాని భార్గవ మనసు రగిలిపోయింది.

ప్రభాకర్‌తో గడిపిన అరగంట సమయం ఆయనకి అర యుగంగా తోచింది. ప్రభాకర్ వెళ్లగానే ఇంత ఎత్తున ఎగిరాడు భార్గవ. 'నలుపు అంటే నాకు అసహ్యం లేదు... కాని.. కాని.. నువ్వు ముట్టుకుంటే మాసిపోతావా అన్నట్లు తెల్లగా ఉంటావు. ఆఫ్రికాలో జనాలు కూడా ప్రభాకర్‌లా ఉంటారని నేను అనుకోను... ఇంత నల్లగా ఉన్న వాడిని నేను ఇప్పుడే చూస్తున్నాను... మరీ ఈ రంగులో ఉన్న వాడిని ప్రేమించావా?.. నీకు మతిపోయిందా?'

'కాని... కాని.. డాడీ.. అతను శ్వేత రజితం క్రీమ్ వాడటం మొదలు పెట్టాడు డాడీ.' ప్రజ్ఞ అంది.

యువతులు తెల్ల బడటానికి శ్వేత స్వర్ణం అన్న క్రీమ్‌ని, యువకులు తెల్లబడటానికి శ్వేత రజితం అన్న ఫెయిర్‌నెస్ క్రీమ్‌లకి ప్రచారం చేసింది స్వయంగా భార్గవే! తను డిజైన్ చేసిన ఆ ప్రకటన నమ్మి తన కూతురు ఇలాంటి నిర్ణయం తీసుకుందా?.. భార్గవ గుటకలు మింగాడు. తమ ప్రకటనలని నమ్మే వారి ఐక్యూ పైన ఆయనకి ఎప్పుడూ చిన్న చూపే ఉండేది.. లేకపోతే ఫలాన కూల్ డ్రింక్ తాగండి అని చెప్పే సినీ నటుడు అందుకుగాను కోట్ల రూపాయలు తీసుకుంటున్నాడని తెలుసుకున్నాక కూడా ఆ కూల్‌డ్రింక్ బాగుంటుందని భ్రమపడే జనాలకి ఏమాత్రం తెలివితేటలు ఉన్నట్లు?.. కాని తన ప్రకటనల గోతిలో స్వయాన తన కూతురే పడుతుందని ఆయన ఎప్పుడూ ఊహించలేదు.

ఆయనకి తన మొదటి బాస్ చెప్పిన సూక్తి గుర్తుకి వచ్చింది. 'ప్రజ్ఞా! మామూలు అబద్ధాలు.. వ్యాపార ప్రకటనలు.. అని అబద్ధాలు రెండు రకాలు.. యాడ్ చూసి పూర్తిగా నమ్మకూడదు తల్లీ!..' నచ్చచెప్పబోయాడు.

'ఏమో డాడీ! అతను రోజుకి ఎనిమిదిసార్లు ఆ క్రీమ్ పూసుకుంటున్నాడు.. కావాలంటే ఇంకో ఆరుసార్లు కూడా రాసుకుంటాడు. అతను నల్లగా ఉండటం నీకు అభ్యంతరం అయితే అతను తెల్లబడ్డాకే పెళ్ళిచేసుకుంటాం..' ప్రజ్ఞ స్థిరంగా అంది.

అలాగయితే మీకు ఈ జన్మకి పెళ్ళి అవదు.. నువ్వు కుమారిగానే ఉండిపోతావు అనుకున్నాడు భార్గవ. అతనికి కోపం ముంచుకు వచ్చింది. ఇంత చదువుకుని మరీ ఇంత అమాయకంగా మాట్లాడుతుందేమిటి?..

'అతను గంటకి ఇరవయి నాలుగుసార్లు రాసుకున్నా ఎక్కువ ఫలితం ఉండదు ప్రజ్ఞా!.. అంతెందుకు ఛాయలో ఉన్న నేను రాసుకున్నా ఫలితం ఉండదు. అర్థంచేసుకో..'

'ఫలితం ఉండకపోతే మరి అలాంటి ఎడ్వర్టైజ్‌మెంట్ ఎందుకు తీశావు డాడీ?" నిలదీస్తున్నట్లు అడిగింది ప్రజ్ఞ.

మాట్లాడలేక తల ఒంచుకుని నిలబడిపోయాడు భార్గవ.

'నువ్వు తీసిన యాడ్ టివిలో చూసి బొంగరాల పిచ్చిలో పడిన వాళ్ళల్లో ప్రభాకర్ మేనల్లుడు కూడా ఉన్నాడుట. మూడో తరగతి చదువుతున్న అతను అంత వరకూ క్లాస్‌ఫస్ట్ వచ్చేవాడుట.. ఇప్పుడు చదువులో వెనకబడ్డాడుట.. అమ్మకాలు పెంచుకోవటానికి పిల్లల మనస్సులు కూడా పొల్యూట్ చేయాలా డాడీ?'

భార్గవ తల ఎత్తలేదు. అతని మొహం నల్లగా మాడిపోయింది.

'బొంగరాలు ఒక్కటే కాదు బాధ్యతా రహితంగా మీరు రూపొందించే ప్రకటనలవల్ల పిల్లలకి చాలా తప్పుడు ఆలోచనలు వస్తుంటాయి. ఆ సంగతి నీకు ఘాటుగా చెప్పాలనే ప్రభాకర్ ఈ నాటకం ఆడాడు..' ప్రజ్ఞ అంది.

పూసుకున్న రంగు కడుక్కోవటానికి వెళ్లిన ప్రభాకర్ ఎప్పుడు వచ్చాడో కాని 'అవును.. మిమ్మల్ని నొప్పిస్తే క్షమించండి..' అన్నాడు.

భార్గవ మెల్లగా తల ఎత్తాడు. అతని మొహం తెల్లగా పాలిపోయింది. ముఖ కవళికలలోనే కాదు అతని దృక్పధంలో కూడా మార్పు వచ్చిందా?...! వస్తుందా?... ఏమో?!

★